ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలి

కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వేములవాడ, మార్చి11: మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వం ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ అనుబంధ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి యేసు రత్నం డిమాండ్ చేశారు. మంగళవారం వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌కు వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, విధుల్లో ఉన్నప్పుడు ఏదైనా ప్రమాదంతో కార్మికుడు మృతి చెందితే రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విరమణ పొందిన కార్మికులకు రూ.10 లక్షల నగదు ఇవ్వాలన్నారు. జీవో నంబర్ 60 ప్రకారం పెంచిన వేతనాల్లో మూడు నెలల బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. వేములవాడ పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ పెరుగుతున్నందున వాణిజ్య అవసరాలకు అనుగుణంగా కార్మికులను పెంచాలని కోరారు. ఇక్కడ జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి కడారి రాములు, కార్మిక సంఘం నాయకులు మల్లేశం, రాజయ్య తదితరులు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

స్కానింగ్ సెంటర్‌లో తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో

సిరిసిల్ల టౌన్, మార్చి 11: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో రజిత హెచ్చరించారు. మంగళవారం సిరిసిల్ల లోని స్కానింగ్ సెంటర్లను ఆమె క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీసీపీఎన్‌టీడీ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. ఫారం ఎఫ్ రికార్డులు, రిపోర్టులను పరిశీలించి లోపాలను సరిచేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఇక్కడ పీహెచ్‌ఎంహెచ్‌ఎన్ ఇన్‌చార్జి డాక్టర్ సంపత్‌కుమార్, రాజ్‌కుమార్, బాలయ్య, దేవిక, మహేశ్ ఉన్నారు.

టెన్త్ విద్యార్థులకు కేటీఆర్ కానుక

- ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్ష
- గిఫ్ట్ ఏ స్మైల్ కింద పరీక్ష ప్యాడ్లు, పెన్నులు
- స్కూళ్లకు వెళ్లి పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు

పదో తరగతి విద్యార్థులకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కానుక పంపించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎగ్జామ్స్ బాగా రాయాలని శుభాకాంక్షలు చెప్పారు. ప్రతి ఏడాది మాదిరి ఈ సంవత్సరం సైతం గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపించగా, మంగళవారం పార్టీ నాయకులు స్కూళ్లకు వెళ్లి అందజేశారు.

ముస్తాబాద్: పరీక్ష ప్యాడ్లతో ముస్తాబాద్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థినులు, బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: పరీక్ష ప్యాడ్లతో రాచర్ల బొప్పాపూర్ జడ్పీఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు, నాయకులు

ముస్తాబాద్, మార్చి 11: ముస్తాబాద్ మండలకేంద్రంతోపాటు పోతుగల్, ఆవునూర్, గూడెం, బంధనకల్, నామాపూర్, చీకోడు, కొండాపూర్, కస్తూర్బా, మోడల్ స్కూల్, టీజీ ఎస్‌డబ్ల్యూ ఆర్ఇఎస్ పాఠశాలల్లోని వందలాది మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు అందజేసినట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు తెలిపారు. ఆయాచోట్ల సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, మాజీ ఎంపీపీ రాష్ట్ర రజక సంఘం అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, ముస్తాబాద్ పట్టణ అధ్యక్షులు ఏద్దండి నర్సింహ రెడ్డి, ఉమ్మడి జిల్లా మాజీ కో ఆప్షన్ మెంబర్ సర్వర్ పాషా , మాజీ సర్పంచ్లు గాండ్ల సుమతీ, నల్ల నర్సయ్య గూడూరి భరత్, జాంగిర్, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, శీలం స్వామి, కొమ్ము బాలయ్య, సంతోష్ గౌడ్, పద్మరెడ్డి, రాంచద్రరెడ్డి, పడిగ అంజనేయులు ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు.

గంభీరావుపేటలో 518 మందికి..

గంభీరావుపేట, మార్చి 11: మండలంలోని ఆయా పాఠశాలల్లో పదో తరగతి చదివే 518 మంది విద్యార్థులకు కేటీఆర్ సమకూర్చిన పరీక్ష ప్యాడ్, పెన్నులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఇక్కడ సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాపాగారి వెంకటస్వామిగౌడ్, నేతలు వెంకటియాదవ్, వహీద్, లింగంయాదవ్, రత్నాకర్, బిల్లా వేణుగోపాల్, పాపారావు, దుబాసి రాజు, అంజయ్య ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: మండలంలోని ఆయా పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు కేటీఆర్ సమకూర్చిన పరీక్ష ప్యాడ్, పెన్నులను బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఇక్కడ మండలాధ్యక్షుడు వర్స కృష్ణహరి, మాజీ జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు ఇల్లెందుల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

తంగళ్లపల్లి జడ్పీ హెచ్ఎస్‌లో..

సిరిసిల్ల రూరల్, మార్చి 11: తంగళ్లపల్లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పంపించిన పరీక్ష ప్యాడ్, పెన్నులను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ ఎంపీపీ పడిగెల మానస, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య అందజేశారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ బండి జగన్, పడిగెల రాజు, భానుమూర్తి, వెంగళ రమేశ్, కనకరాజు, అనిల్ ఉన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఒకరికి జైలు

గాంధీ చౌక్, మార్చి 11: చెక్ బౌన్సు కేసులో ముద్దాయికి 18 నెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు చెప్పారు. 2016లో సిరిసిల్లకు చెందిన రామినేని శశి రాజారావు తన అవసరాల నిమిత్తం కోడం నరేష్ వద్ద రూ.5లక్షలు అప్పుగా తీసుకుని చెక్ ఇచ్చాడు. అనంతరం చెక్కును బ్యాంకులో వేయగా బౌన్సు అయింది. దీంతో బాధితుడు సిరిసిల్ల కోర్టులో న్యాయవాది లక్కం కిషోర్ ద్వారా కేసు దాఖలు చేశారు. కేసును విచారించిన మెజిస్ట్రేట్ రామినేని శశి రాజారావుకు 18 నెలల జైలు శిక్షతో పాటు రూ.7.50లక్షలు బాధితుడు నరేష్‌కు ఇవ్వాలని తీర్పు చెప్పారు.

సద్వినియోగం చేసుకోవాలి

ముస్తాబాద్, మార్చి 11: గ్రామీణ ప్రాంత పేదల సౌకర్యార్థం కల్వకుంట్ల రమాదేవి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆయ్యప్పస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు డాక్టర్ కల్వకుంట్ల లక్ష్మణ్ రావు మంగళవారం సూచించారు. ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిబిరానికి మండలంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు వస్తున్నారన్నారు. కంటి పరీక్షలతో పాటు వైద్యుల సూచన మేరకు అవసరం ఉన్నవారికి ఆపరేషన్లు చేసి, అద్దాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. శిబిరానికి వచ్చేవారికి భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

శతాధిక వృద్ధురాలి మృతి

బండారి నర్సవ్వ

చందుర్తి,మార్చ్ 11: లింగంపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు బండారి నర్సవ్వ(102) వయోభారంతో మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నర్సవ్వకు ఆరుగురు సంతానం. ఐదుగురు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. వీరిలో ఒక కుమార్తె మృతి చెందింది. ఆమె ఎక్కువ సజ్జ, జొన్న రొట్టె, అంబలి, రాగి ముద్ద, పాలు, పెరుగు తింటూ ఆరోగ్యంగా ఉండేదని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మనమండ్లు, మునిమనమండ్లను కూడా ఆమె చూసిందని వివరించారు.

మార్కెట్‌లోని సమస్యలు పరిష్కరిస్తాం

కోనరావుపేట, మార్చి 11: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య డైరక్టర్లతో కలిసి సాధారణ సమవేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు. ప్రధానంగా అసంపూర్తిగా ఉన్న కాంపౌండ్ వాల్‌ను పూర్తి చేయాలని నిర్ణయించారు. మార్కెట్‌కు రెండు గేట్లు, ఆర్చి నిర్మించాలని తీర్మానం చేశారు. ఇక్కడ వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, కార్యదర్శి సత్యనారాయణ, డైరక్టర్లు వెంగళి వెంకన్న, నాగభూషణం పాల్గొన్నారు.

రీచార్జి పిట్లను నిర్మించుకోవాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 11: రైతులు తమ వ్యవసాయ పొలాల వద్ద వేయించిన బోరు బావుల చుట్టూ రిచార్జి పిట్లను నిర్మించుకోవాలని మండల ప్రత్యేకాధికారి అప్జల్‌బేగం సూచించారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన కోనేటి లక్ష్మి వ్యవసాయ పొలంలోని బోరు బావి వద్ద నిర్మించిన రిచార్జి పిట్‌ను పరిశీలించారు. రీచార్జి పిట్లతో భూగర్భజలాలు పెరుగుతాయని, ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టే కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. ఈజీఎస్ కింద నిర్మించుకోవచ్చునని సూచించారు. ఇక్కడ ఎంపీడీవో సత్తయ్య, ఏపీవో, ఏపీవో ఉన్నారు.

వర్గీకరణ తర్వాతే నియామకాలు చేపట్టాలి

చందుర్తి,మార్చి 11: ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టం చేసిన తర్వాతనే గ్రూప్స్ నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు తర్రె శంకరయ్య మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం చందుర్తిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాదిగల పట్ల చూపుతున్న వివక్షను మానుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు దుమ్ము రమేశ్, ప్రధాన కార్యదర్శులు బాబు మాదిగ, కట్కూరి ప్రశాంత్ మాదిగ ఎమ్మార్పీఎస్ నాయకులు నేరెళ్ల దేవయ్య మాదిగ, సిరిసిల్ల ఆశయ్య మాదిగ, గొర్రె శంకర్ మాదిగ, బాబు మాదిగ ఉన్నారు.

సిరిసిల్ల రూరల్, మార్చి 11: తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం నిరసన దీక్ష చేపట్టారు. ఎస్సీల వర్గీకరణ బిల్లును చట్టం చేసిన తర్వాతనే గ్రూప్స్, ఇతర నియామకాలు చేపట్టాలని మండల అధ్యక్షుడు సావనపల్లి బాలయ్య డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు సవన పెల్లి బాలయ్య, ప్రధాన కార్యదర్శి అవునురి రమేశ్, గౌరవ అధ్యక్షులు మల్యాల లచ్చన్న మండల కార్యదర్శి కొమ్మెట దేవయ్య, మహంకాళి రవి, సీనియర్ నాయకులు శంకర్, మల్లరపు నరేష్ ఉన్నారు.

డివిడెంట్ ఫండ్ ఖాతాల్లో జమచేస్తాం

- అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ

మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ

సిరిసిల్ల టౌన్, మార్చి 11: మహాసభ తీర్మానంలో సభ్యుల ఆమోదం మేరకు 2023-24ఆర్థిక సంవత్సరానికి గానూ 12శాతం డివిడెంట్ ఫండ్‌ను బ్యాంకు సభ్యుల ఖాతాల్లో జమచేయడానికి పాలకవర్గం నిర్ణయం తీసుకున్నట్లు అర్బన్ బ్యాంకు(సిరిసిల్ల) చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ తెలిపారు. మంగళవారం సిరిసిల్లలోని అర్బన్ బ్యాంకులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ్యులు తమ సేవింగ్ ఖాతాలను(కేవైసీ) ఆధార్, పాన్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం బ్యాంకులో 7200మంది సభ్యులకు 4600మంది ఖాతాలు కలిగి ఉన్నారని, మిగిలిన వారందరూ సేవింగ్ ఖాతాలను తీసుకుని డివిడెంట్ ఫండ్‌ను తమ ఖాతాలో జమ చేసుకోవాలని తెలిపారు. టర్మ్ డిపాజిట్‌లపై అన్ని బ్యాంకుల కన్నా అధిక వడ్డీ ఇస్తున్నామని, పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్ధ వార్షిక మహాసభ ఈ నెల 26న సిరిసిల్లలోని పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నామని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ అడ్డగట్ల మురళి, కార్యవర్గ సభ్యులు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవవాస్, ఏనగందుల శంకర్, వలుస హరిణి, పత్తిపాక సురేష్, కోడం సంజీవ్, తదితరులున్నారు.

ఎండిన పంటల పరిశీలన

ఇల్లంతకుంట, మార్చి 11: పెద్దలింగాపూర్ గ్రామంలో ఎండిన పంటలను మండల వ్యవసాయ అధికారి సురేశ్ రెడ్డి, ఏఈవో జ్యోతితో కలిసి మంగళవారం పరిశీలించారు. పంటలు ఎండిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎండిన పంటలను సర్వే చేస్తున్నట్లు చెప్పారు.

ఏపీఎంలు, సీసీలకు అవగాహన

కలెక్టరేట్, మార్చి 11: మానవ అక్రమ రవాణా, పిల్లల అపహరణకు సంబంధించి పలు అంశాలపై డీఆర్‌డీవో శేషాద్రి మంగళవారం ఏపీఎంలు, సీసీలకు అవగాహన కల్పించారు. కలెక్టర్ సూచనల మేరకు క్యాక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడ ఏపీడీ గోట్టి శ్రీనివాస్, డీపీఎం, ఏపీఎం,సీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య

విద్యార్థులకు కంటి అద్దాలు అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి11: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తున్నదని విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆర్‌బీఎస్‌కే వారి ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చారు. విద్యార్థులతో ముచ్చటించి, వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, 55 ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాలల నిర్మాణం కోసం రూ.200 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని పేర్కొన్నారు. రుద్రంగిలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు వివరించారు. కేజీవీబి, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల యోగ క్షేమాల బాధ్యత ప్రభుత్వానిదేనని, వచ్చే పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు ప్రతిభచూపాలని సూచించారు. ఇక్కడ జిల్లా వైద్యాధికారి రజిత, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, మండల విద్యాధికారి బన్నాజీ, జీఈసీఓ పద్మజ, వైద్యాధికారులు నహి మ జహ, సంపత్, ఏఎన్ఎం శైలజ, సౌజన్య ఉన్నారు.

₹3,948 కోట్ల రుణ సాయం అందించాలి

పీఎల్‌పీని విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు

కలెక్టరేట్, మార్చి 11: రాబోయే ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు రూ.3,948 కోట్ల రుణ సాయం అందించాలని జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) జిల్లాలోని బ్యాంకులకు నిర్దేశించింది. గతేడాది లక్ష్యం రూ.3,203 కోట్లతో పోల్చితే ఇది 23 శాతం అధికమని పేర్కొంది. దేశ అభివృద్ధి బ్యాంక్‌గా నాబార్డు ప్రతి ఏటా జిల్లా, రాష్ట్ర స్థాయిలో పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్లు సిద్ధం చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, మంగళవారం కలెక్టరేట్‌లో 2025-26 సంవత్సరానికి సంబంధించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్ (పీఎల్‌పీ)ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా విడుదల చేశారు. కార్యక్రమంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ ఎం. దిలీప్ చంద్ర, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి బి. శేషాద్రి, లీడ్ జిల్లా మేనేజర్ టి.ఎన్. మల్లికార్జునరావు, జిల్లా సహకార అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

*Ullendula Swetha, W/o Ullendula Ashok (Old name) H.No. 1-39/3 V/o Ayyorupally Vemulawada mandal, Rajanna Siricilla Dist., TS. my was changed to Challuri Swetha w/o Ullendula Ashok (New Name) for all purpose.
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

గ్రూప్-2 ఫలితాల్లో సత్తా

- జిల్లాకు చెందిన యువకుల ప్రతిభ
- గొట్టిపర్తి రాకేశ్‌కు 24వ ర్యాంకు

జీ రాకేశ్

ఇల్లంతకుంట, మార్చి 11: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో జిల్లాకు చెందిన యువకులు సత్తాచాటారు. ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామానికి చెందిన గొట్టిపర్తి రాకేశ్ రాష్ట్రస్థాయిలో 24వ ర్యాంకు సాధించాడు. రాకేశ్‌ను గ్రామస్తులు, మండల నాయకులు అభినందించారు.

అఖిల్ రెడ్డికి 34వ ర్యాంక్

అఖిల్ రెడ్డి

చందుర్తి, మార్చి11: గ్రూప్-2 ఫలితాల్లో చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామానికి చెందిన ఎగుమామిడి అఖిల్ రెడ్డి సత్తాచాటారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన అతను, బాల్యం నుంచే చదువులో రాణిస్తున్నాడు. తల్లిదండ్రులు సత్యనారాయణ రెడ్డి-ఉమ కష్టాన్ని గుర్తించి ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా కసరత్తు చేశాడు. గతంలో గ్రూప్-1 ఉద్యోగం వచ్చినట్టే వచ్చి చేజారి పోగా, తాజాగా గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 34వ ర్యాంక్ సాధించాడు. అఖిల్‌రెడ్డిని మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు దూది శ్రీనివాస్ రెడ్డి, యువ నాయకుడు ఎడమల ఆదిత్య రెడ్డి అభినందించారు.

జూనియర్ అసిస్టెంట్‌కు 56వ ర్యాంకు

వేములవాడరూరల్: రంజిత్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

వేములవాడ రూరల్, మార్చి 11: గ్రూప్-2 ఫలితాల్లో అగ్రహారంలోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కాలేజీ జూనియర్ అసిస్టెంట్ రంజిత్ సత్తాచాటారు. రాష్ట్ర స్థాయిలో 56 ర్యాంకు సాధించారు. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలం పాపయ్యపల్లికి చెందిన రంజిత్‌కు గతంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌వో ఉద్యోగం సాధించాడు. మొదటగా పంచాయతీ కార్యదర్శిగా కొనసాగగా, అనంతరం వీఆర్‌వోగా ఉద్యోగం పొందాడు. వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేయగా డిగ్రీ కళాశాలకు జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యాడు. గ్రూప్-2 ఫలితాల్లో సత్తా చాటడంతో రంజిత్‌ను కళాశాల ప్రిన్సిపాల్ శంకర్ మంగళవారం ఘనంగా సన్మానించారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా రమేశ్

కోర్టుచౌరస్తా, మార్చి 11: కరీంనగర్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది చామనపల్లి రమేశ్‌ను కరీంనగర్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ) గా నియమిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రామడుగు మండలం వెలిచాలకు చెందిన రమేశ్ 20ఏండ్లుగా కోర్టులో న్యాయ వాద వృత్తిలో కొన సాగుతున్నారు. ఏజీపీగా రమేశ్ నియామకంపై న్యాయవాదులు గడ్డం లక్ష్మణ్, కొరివి వేణుగోపాల్ హర్షం వ్యక్తం చేశారు.

కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోం

- ఏపీ టీడీపీ నేత బుద్ధా వెంకన్న తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి
- లేదంటే తగిన గుణపాఠం చెబుతాం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆగ్రహం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నేత కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, మార్చి 11: 'మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోం. ఇటీవల ఏపీ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి. లేదంటే తగిన గుణపాఠం తప్పదు' అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ హెచ్చరించారు. మంగళవారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి బుద్ధా వెంకన్నకు లేదని, నోరు అదుపులో పెట్టుకోకపోతే నాలుక చీరేస్తామని హెచ్చరించారు. రాజకీయం ఏదైనా ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో చేసుకోవాలని, కేటీఆర్‌పై గాని, తెలంగాణ ప్రజలపై మాట్లాడే అర్హత అతనికి లేదని హితవుపలికారు. ఐటీ రంగంలో తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచంలోనే ఆదర్శంగా నిలిపిన ఘనత కేటీఆర్‌కు మాత్రమే దక్కుతుందన్నారు. సిరిసిల్లలో ఏ గ్రామానికి వెళ్లినా కేటీఆర్ చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు. నాడు ఉరిశాలగా ఉన్న సిరిసిల్లను, సిరిశాలగా మార్చిన దార్శనికుడు అని కొనియాడారు. మీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని అడిగితే కేటీఆర్ గొప్పతనం గురించి చెబుతారని సూచించారు. తెలంగాణలో మళ్లీ పాతరోజులు వస్తాయని చంద్రబాబు అనుచరులు పగటి కలలు కంటున్నారని, అవి కలలుగానే మిగిలిపోతాయన్నారు. తెలంగాణ కోసం ఇక్కడి ప్రజల కోసం కొట్లాడేది ఎప్పటికీ కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని గుర్తుంచుకోవాలన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన నాయకుడు కేటీఆర్‌పై విమర్శలు చేసి సెలబ్రిటీ అవుతామని అనుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మరోసారి ఇటువంటి విమర్శలు చేస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. బుద్ధా వెంకన్నను తెలంగాణలో ఎక్కడ కనిపించినా అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు. ఇక్కడ మట్టే శ్రీనివాస్, కోడం వెంకటేష్, నవీన్, రుద్రవీణ, సుజిత్, గాజుల మహేష్, అడిచెర్ల సాయికృష్ణ, కాసర్ల వినయ్ పాల్గొన్నారు.

వేములవాడకు అడిషనల్ కోర్టు మంజూరు చేయండి

- హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయదులు

జస్టిస్ రాజేశ్వరరావును సన్మానిస్తున్న వేములవాడ బార్ న్యాయవాదులు

వేములవాడ, మార్చి11: వేములవాడ కోర్టు న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని హైకోర్టు న్యాయమూర్తి, రాజన్న సిరిసిల్ల జిల్లా ఫోర్ట్ పోలియో జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావుకు స్థానిక న్యాయవాదులు విజ్ఞప్తి చేశారు. వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం నేతృత్వంలో పలువురు న్యాయవాదులు మంగళవారం హైదరాబాద్‌లోని హైకోర్టు ప్రాంగణంలో జస్టిస్ రాజేశ్వరరావును కలిసి వేములవాడ రాజన్న ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ వేములవాడకు అడిషనల్ కోర్టు మంజూరు చేయాలని, ప్రస్తుతం ఉన్న కోర్టు బిల్డింగ్‌పై అదనపు అంతస్తు నిర్మాణం చేయాలని, కక్షిదారులకు మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి